




ఇంకా ఎదురు చూపులేనా?

- కాంగ్రెస్ ఆశావహుల్లో ఆందోళన
- కొలిక్కిరాని కరీంనగర్ అభ్యర్థి ఎంపిక
- మరో 32 రోజుల్లో పోలింగ్
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు తిరిగేదెట్లా?
- అధిష్ఠానం వైఖరిపై అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పార్లమెంట్ ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ ఆశావహుల్లో ఆందోళన పెరిగిపోతున్నది. మరో 32 రోజుల్లో పోలింగ్ జరుగనుండగా ఇప్పటికీ కాంగ్రెస్ కరీంనగర్ అభ్యర్థి ఎవరో ప్రకటించక పోవడంతో అధిష్ఠానంపై ఆశావహులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ నెలరోజుల క్రితమే అభ్యర్థులను ప్రకటించాయి. ఆ పార్టీల అభ్యర్థులు అన్ని హంగులను సమకూర్చుకుని ఇప్పటికే రెండు విడతలుగా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారం నిర్వహించారు. పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికలకు సమాయత్తం చేసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఎంపిక చేయడంలో కేంద్ర ఎన్నికల కమిటీ మల్లగుల్లాలు పడుతూ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎంపికతో కరీంనగర్‌ను ముడిపెట్టి పెండింగ్‌లో పెట్టింది. దీంతో ఆశావహుల్లోనే కాకుండా నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలు, శ్రేణుల్లోనూ తీవ్ర అసహనం పెరుగుతున్నది.

● 13న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం

ఈనెల 11న రంజాన్ పండుగ ఉండగా 13న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆరోజు అభ్యర్థిని ప్రకటించినా పోలింగ్ తేదీకి సరిగ్గా 30 రోజులు మాత్రమే మిగిలి ఉంటుంది. తాము డబ్బు, వాహనాలు, ఇతరత్రా సౌకర్యాలు, ప్రచార సామాగ్రి సమకూర్చుకోవడానికే కనీసం వారం, పది రోజులు గడిచిపోతాయని ఆశావహులు అంటున్నారు. మిగిలిన సమయంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటర్లను కలిసి ప్రచారం చేసుకునేందుకు సరిపోతుందా అని ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు పెట్టుకుని ఎన్నికల బరిలో దిగితే ప్రజలను కలవలేక ఓటు అడిగే సమయంలేక ఓడిపోతే పరిస్థితి ఏమిటని వారు పునరాలోచనలో పడుతున్నట్లు తెలిసింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌ను తిరిగి కరీంనగర్ అభ్యర్థిగా ప్రకటించింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖాయం చేసింది.

● అవకాశం దక్కేదెవరికో..?

కాంగ్రెస్ నుంచి పలువురు దరఖాస్తు చేసుకున్నా చివరికి కేంద్ర ఎన్నికల కమిటీ పరిశీలనలో మూడు పేర్లు మాత్రమే వస్తున్నాయని సమాచారం. మాజీ శాసనసభ్యుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, తీన్మార్ మల్లన్నలో ఒకరికి అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. ఖమ్మంలో రెడ్డి సామాజిక వర్గ అభ్యర్థికి అవకాశం కల్పిస్తే వెలిచాల రాజేందర్‌రావుకు కానీ బీసీ సామాజికవర్గానికి చెందిన మల్లన్నకు కాని అవకాశం ఇస్తారని చెబుతున్నారు. రాహుల్‌గాంధీ టీంలో సభ్యుడైన రుద్ర సంతోష్ బీసీ సామాజికవర్గానికి చెందిన వాడే కాకుండా స్థానికుడినైన తనకు అవకాశం కల్పించాలని పట్టుపడుతూ కేంద్ర ఎన్నికల కమిటి సభ్యులను, వర్కింగ్ కమిటీ సభ్యులను కలుస్తూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వీరంతా టికెట్ కోసం ఒకవైపు ప్రయత్నాలు చేస్తూనే మరోవైపు నెలరోజుల గడువులో ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించి మెప్పించగలమా లేక తెలిసీ డబ్బును, సమయాన్ని వృధా చేసుకున్నవారిమవుతామా అన్న ఆందోళనకు గురవుతున్నారని తెలిసింది.

నేడు రంజాన్

● ఈద్ ప్రార్థనలకు ఘనంగా ఏర్పాట్లు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 10: రంజాన్‌ను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు గురువారం జరుపుకోనున్నారు. బుధవారం రాత్రి నమాజుల అనంతరం నెలవంక కనిపించడంతో రంజాన్ మాస ముగింపు సూచకంగా భావించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల రోజుల దీక్ష ముగించి మరునటి రోజు ప్రత్యేక సామూహిక నమాజ్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

● నేడు ఈద్గాల్లో నమాజు, సందేశాల వివరాలు



సాలెహ్‌నగర్ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు

ఎండ తీవ్రత దృష్ట్యా నగరంలోని, నగర శివారులోని పలు ఈద్గా మైదానాల్లో గురువారం ఉదయం 9 నుంచి 10 గంటల లోపే సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద గల పురానీ (ఖదీమ్‌షాహి) ఈద్గాలో 9 గంటలకు సయ్యద్ షా మొహమ్మద్ ఖాద్రి నమాజ్ చేయించి సందేశమివ్వనున్నారు. చింతకుంట ఈద్గాలో 9 గంటల నుంచి ముఫ్తి ఎత్తెమాదుల్‌హక్ నమాజ్ చేయించనుండగా మొహమ్మద్ ఖైరొద్దీన్ సందేశమివ్వనున్నారు. సాలెహ్‌నగర్ ఈద్గాలో ఉదయం 9-30 గంటలకు కరీంనగర్ సదర్ ఖాజీ మన్‌ఖబత్‌షాఖాన్ నమాజ్ చేయించ నుండగా ముఫ్తీ మహమ్మద్ ఫియాస్ మొహియొద్దీన్ సందేశమివ్వనున్నారు. జిల్లా కేంద్రంలో పురానీ ఈద్గాతోపాటు సాలెహ్‌నగర్, చింతకుంట, బైపాస్‌రోడ్ ఈద్గాల్లో, పలు మండల, గ్రామ కేంద్రాల్లోని ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు జరగనున్నాయి. ఆయా ఈద్గాలలో మున్సిపల్ కార్పొరేషన్, గ్రామపంచాయతీ, పోలీసు, ఫైర్, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

● మార్కెట్‌లో సందడి

రంజాన్ పండగ వస్త్రాలు, వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. ముస్లింలు షాపింగ్ చేస్తూ బిజీగా గడుపుతున్నారు. గిరాకీ బాగుంటుందని వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వస్త్ర, వ్యాపార సముదాయాలు జన జాతరను మరపిస్తున్నాయి. పురుషులు బట్టలు, టోపీలు, అత్తర్లు, స్ప్రేలు, భుజాలపై టవల్స్, స్వీట్లు, సేమియాలు, స్త్రీలు బట్టలు, గాజులు, సుర్మా, మెహందీ, అలంకరణ సామాగ్రి కొంటున్నారు. గృహాలంకరణ సామాగ్రికి గిరాకీ పెరిగింది.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10: బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో మధ్యాహ్నం 3.30 నుంచి జూనియర్ బాలబాలికల విభాగంలో ఈ పోటీలను నిర్వహించనున్నామని బాస్కెట్ బాల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి అనంతరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈ నెల 21 నుంచి 23 వరకు హైదరాబాద్‌లోని మియాపూర్ డీపీఎస్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు ఒరిజినల్‌తోపాటు జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో స్టేడియానికి రావాలని సూచించారు.

'డంప్‌యార్డును వెంటనే తొలగించాలి'

భగత్‌నగర్, ఏప్రిల్ 10: నగర శివారులోని డంప్ యార్డును వెంటనే తొలగించాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లిరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బైపాస్ రోడ్డులోని డంప్ యార్డులో నిత్యం మంటలు రావడంతో పరిసర ప్రాంతాల్లో ప్రజలు పొగతో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. కోతిరాంపూర్, అలకాపురికాలనీ, హౌసింగ్ బోర్డు, గణేష్‌నగర్, హనుమాన్‌నగర్, కట్టరాంపూర్, లక్ష్మీనగర్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డంప్ యార్డును వెంటనే వేరే ప్రాంతానికి తరలించాలని, లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కరీంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి, ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆమె హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా పలు అంశాలపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడ కూడా తాగునీటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

సమస్యలు తలెత్తకుండా ప్రతి రోజు మానిటరింగ్ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. బోరు బావులు, వ్యవసాయ బావులు, ట్యాంకర్లను అందుబాటులో ఉంచుకొని తాగునీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అన్నారు. గోనె సంచులకు కొరత లేకుండా చూడాలని, సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడువకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైసుమిల్లులకు పంపించాలని చెప్పారు. ప్రతి రైతుకు మద్దతుధర కల్పించడంతోపాటు దళారుల దోపిడీకి గురికాకుండా చూడాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతులు, కొత్త పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. జూన్ 10లోగా పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు మౌలిక వసతుల కల్పన పనులను పూర్తి చేయించాలన్నారు. అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు. బ్యాంకు ఖాతాలను సత్వరమే ఓపెన్ చేయాలని, అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలనిఆదేశించారు. వేసవి ఎండల తీవ్రంగా ఉన్నందున ఎండల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బబారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, దవాఖానాల్లో ముందస్తుగా అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రజలకు, ఉపాధి హామీ కూలీలకు అందించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ కూలీలు పనిచేసే ప్రాంతాల్లో తగిన వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఆర్డీవో శ్రీధర్, డీపీవో రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, డీఈవో జనార్దన్‌రావు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సివిల్ సప్లయిస్ డీఎం రజనీకాంత్, డీసీఎస్‌వో గౌరిశంకర్ పాల్గొన్నారు.

కాప్రా పురుగు రాకుండా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్ , ఏప్రిల్ 10: బియ్యం బస్తాల్లో కాప్రా పురుగు రాకుండా రైస్ మిల్లర్లు చర్యలు తీసుకోవాలని, సీఎంఆర్ విషయంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి రైస్ అన్నారు. బుధవారం కరీం నగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లోని భాస్కర్



అలుగునూర్‌లోని రైస్ మిల్లులో గోనె సంచులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లింగ్ చేసే విధానం, గోనె సంచులను ఆమె పరిశీలించారు. సీఎంఆర్ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎఫ్‌సీఐ అధికారులతో పాటు తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా రైస్ మిల్ నిర్వహకులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరిం చారు. పాత సంచులకు బదులు కొత్త సంచులను అందిజ్తే కాప్రా పురుగు రాకుండా చర్యలు తీసుకుం టామని, సమస్య అంత పాత సంచులతోనే వస్తోం దని కలెక్టర్‌కు రైస్ మిల్ నిర్వహకులు తెలిపారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

అలుగునూర్‌లోని పొరండ్ల వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డు తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనాలని కలెక్టర్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీఎస్‌వో సురేశ్, తహసీల్దార్ కనకయ్య, తాటికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ రూరల్: తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం ఆమె కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్, చింతకుంట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకులు, సంపులు శుభ్రం చేయాలన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కమాన్‌పూర్, చింత కుంట గ్రామాల్లో డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద ఎస్డీఎఫ్ నిధులతో కొత్తగా వేసిన బోర్లను పరిశీలించారు. స్వచ్ఛమైన నీటినిప్రజలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ సూర్యప్రకాశ్, తహసీల్దార్ రాజేశ్, ఆర్ఐ అరుణ్ పాల్గొన్నారు.

పెరుగుతున్న శబ్ద కాలుష్యం

- కరీంనగర్‌లో ప్రమాణాలకు మించి శబ్దాలు
- ప్రజలకు తప్పని తిప్పలు
- బైక్‌ల సైలెన్సర్లతోపాటు ఎన్నికల మైక్‌లు, డీజేల హోరు....



కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: కరీంనగర్‌లో శబ్దకాలుష్యం రోజు రోజుకు పెరుగుతున్నది. ప్రమాణాలకు మించిన వివిధ రకాల శబ్దాలతో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. శబ్ద కాలుష్యం చెవులకు చిల్లుపడేలా ఉండడంతో నగర ప్రజలు అశాంతికి గురవుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న వాహనాలు, ఫంక్షన్ హాల్స్ సౌండ్స్‌తోపాటు లౌడ్ స్పీకర్లు, జనరేటర్లు, వాహనాల హారన్లు, బాణాసంచా, మైనింగ్ శబ్దాలే కాకుండా పెద్ద ఎత్తున సాగుతున్న గృహ నిర్మాణం, డీజేలు అర్ధరాత్రి వరకు పరిమితులకు మించిన శబ్దాలు చేస్తున్నాయి. పెద్ద ఎత్తున వెలువడుతున్న శబ్దాలతో చిన్నపిల్లలు మొదలు వృద్ధుల వరకు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై కొందరు ఆకతాయిలు వింతైన హారన్లతో శబ్దాలు చేస్తున్నారు. విపరీతంగా శబ్దం వచ్చేలా సైలెన్సర్లను బిగించి తిరుగుతున్నారు. దీంతో రాత్రి విశ్రాంతి తీసుకునే సమయంలో మహిళలు ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● అవగాహనతోపాటు పోలీసుల స్పెషల్ డ్రైవ్...

శబ్ద కాలుష్యాన్ని పెంచే సైలెన్సర్లను వాహనాలకు బిగిస్తే వాహన యజమానులతో పాటు బైక్ మెకానిక్‌లపై కూడా చర్యలు తీసుకుంటామని పోలీసు శాఖ హెచ్చరిస్తున్నది. మార్చి 20న కరీంనగర్ పరిధిలోని బైక్ మెకానిక్‌లకు శబ్ద కాలుష్యంపై పోలీసులు అవగాహన కల్పించారు. కరీంనగర్‌లో ఇటీవల దాదాపు వంద వరకు మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించిన బైక్‌లపై కేసులు నమోదు చేసి, జరిమినా విధించారు.

● ఎన్నికల ప్రచారంలో సౌండ్ పెంచితే కేసులు...

మే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచారంతో మైక్‌లు హోరెత్తనున్నాయి. . విపరీతమైన శబ్దాలను పెట్టడం ద్వారా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉండడంతో ఎన్నికల సంఘం నిబంధనలను విధించింది. మైక్ ప్రచారానికి ముందస్తు అనుమతిని పొంది, నిబంధనలకు విరుద్ధంగా శబ్దాలను పెట్టినట్లయితే సంబంధిత అభ్యర్థిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా కూడా విధిస్తారు. నివాస ప్రాంతాల్లో 45-50 డెసిబుల్స్, ఆసుపత్రులు, విద్యాలయాలు, న్యాయస్థానాల ప్రాంతాల్లో 40-50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55-65 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో 70-75 డెసిబుల్స్ శబ్దం మాత్రమే వినిపించాలి.

● మోడిఫైడ్ సైలెన్సర్లతో న్యూసెన్స్...

రోడ్లపై మితిమీరిన వేగంతో చెవులకు చెల్లు పడే శబ్దంతో వెళ్తున్న ద్విచక్ర వాహనాలు ఎక్కువయ్యాయి. షోరూం నుంచి కొనుగోలు చేసిన వాహనాలకు ఉన్న సైలెన్సర్లను తొలగించి వాటిని అధిక శబ్దం వచ్చేలా మోడిఫైడ్ చేసి వాహనాలకు బిగించి రోడ్లపై వెళ్లే వారికి దడ పుట్టిస్తున్నారు. 80 శాతం వాహనాలు అటు పర్యావరణానికి ఇటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. సాధారణంగా 60 డెసిబుల్స్ శబ్దం వరకు ఎలాంటి హాని ఉండదు. 120 డెసిబుల్స్ కన్నా ఎక్కువగా శబ్దం వినడం చెవుడుకు దారితీస్తుంది. ఫంక్షన్లలో పెద్ద శబ్దాలతో డీజేలు పెట్టి ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు.

● సైలెంట్ జోన్లు గుర్తించాలి..

- కిరణ్‌కుమార్, సామజిక కార్యకర్త



నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా సైలెంట్ జోన్లను గుర్తించాలి. చికిత్స పొందుతున్న రోగులకు ఇబ్బంది కలుగకుండా ఆసుపత్రుల పరిసరాలు, విద్యా సంస్థలు, కోర్టులు, ఇతర కొన్ని ముఖ్య ప్రదేశాల చుట్టూ శబ్దం లేకుండా చూడాలి. నగర పాలక సంస్థ సైలెంట్ జోన్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. నాయిస్ మానిటరింగ్ మ్యాపులు ఏర్పాటు చేయాలి

పిచ్చి కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో హన్‌మాన్‌నగర్, మెయిన్ రోడ్‌పై బుధవారం పిచ్చి కుక్కలు వీరంగం సృష్టించాయి. దారి వెంట వెళ్లే వారిపై పిచ్చి కుక్కలు దాడికి తెగబడ్డాయి. ఎక్క డ పడితే అక్కడ దాడి చేస్తూ గాయపర్చడంతో భయంతో పరుగులు తీశారు. హన్‌మాన్‌నగర్‌లో నలుగురిపై, మెయిన్‌రోడ్‌పై మరో నలుగురుపై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. అబ్బుల్లా, ఆరీఫ్, షాదుల్, అజ్జాన్‌తో పాటు మరో నలుగురిని పిచ్చి కుక్కలు గాయపర్చాయి. గాయ పడ్డ వారిలో నలుగురు మహిళలు ఉన్నారు. వీరందరిని ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కొందరిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భూఆక్రమణ కేసులో ధరణి మాజీ కో ఆర్డినేటర్ బుచ్చిరాజు అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో నిందితుడిగా ఉన్న కరీంనగర్ కలెక్టరేట్‌లో ధరణి మాజీ కోఆర్డినేటర్ భగత్‌నగర్‌కు చెందిన ఎల్లంకి బుచ్చిరాజును కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ బుధవారం అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్‌లో నకిలీ ధ్రువపత్రాలతో భూ ఆక్రమణకు పాల్పడినట్లు బాధితుడు బొంతల రఘు ఫిర్యాదుతో కొత్తపల్లి ఠాణాలో ఇదివరకే మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌తో సహా 12 మందిపై కేసు నమోదైంది. కాగా అప్పుడు తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మిగతా 9 మందిలో ఏ12 నిందితుడిగా ఉన్న ఎల్లంకి బుచ్చిరాజును బుధవారం అరెస్టు చేశారు. బుచ్చిరాజు గతంలో కలెక్టరేట్‌లో ధరణి కోఆర్డినేటర్‌గా పనిచేశాడని, తహసీల్దార్‌కు సహకరించాడని సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వీర్నపల్లి, ఏప్రిల్ 10: పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు ఎక్కడున్నా పట్టేస్తున్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో పెద్దమ్మ ఆలయం వద్ద అదే గ్రామానికి చెందిన బొజ్జ కనకరాజు సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పరిజ్ఞానంతో పోలీసులు పట్టుకున్నారు. ఫోన్‌ను బుధవారం ఏఎస్ఐ రాజిరెడ్డి బాధితుడికి అందజేశారు.

ఎండవేడికి చెరువులోని చేపలు మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని మర్రిపల్లిలోని చెరువులో ఎండ వేడిమిని తట్టుకోలేక చేపలు మృతి చెంది బుధవారం ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. చెరువును ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటేష్ కుమార్, కోర్ కమిటీ సభ్యులు చొక్కాల రాము, రేగుల మల్లికార్జున్, రేగుల రాజేశం, మర్రిపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పండుగ మల్లేశం, సభ్యులు పరిశీలించారు.

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా పొన్నం అశోక్‌గౌడ్



కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 10: మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు, సీనియర్ న్యాయవాది పొన్నం అశోక్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్, హ్యూమన్, ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా నియామకం చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అడ్వకేట్ సెక్రెటరీ విపుల్ మహేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ న్యాయవాది, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొన్నం అశోక్‌గౌడ్‌కు పదవి రావటంపై కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని పటిష్టపరిచేందుకు తన శక్తివంచ లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి రావటంలో కీలకంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఏఐసీసీ అడ్వకేట్ సెక్రెటరీ విపుల్ మహేశ్వరిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కరీంనగర్ రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్
- అల్లీపూర్ గురుకుల పాఠశాలలో విచారణ

రాయికల్, ఏప్రిల్ 10: గురుకుల పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గురుకుల పాఠశాలల రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్ పేర్కొన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ మహాత్మ బాపూలే గురుకుల పాఠశాలలో జరిగిన విద్యార్థుల ఘర్షణపై గురుకుల పాఠశాలల కరీంనగర్ రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్ బుధవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో గౌతమ్ మాట్లాడుతూ గురుకులంలో చదివే విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటారని, బాత్‌రూమ్‌కు వెళ్లే సందర్భంలో విద్యార్థుల మధ్య జరిగిన ఘటనలో విద్యార్థి గాయపడినట్లు తెలిసిందని పేర్కొన్నారు. గాయపడిన విద్యార్థి పాఠశాలలో ఉపాధ్యాయులకు తెలియజేయక పోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆశ్రయించి ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. ఉగాది సందర్భంగా సెలవు కావడంతో పాఠశాలలో ఉపాధ్యాయులు దశలవారీగా విధులు నిర్వహిస్తారన్నారు.

విద్యార్థి గాయపడిన విషయం ఉపాధ్యాయులకు తెలుపకపోవడం వల్లే తల్లిదండ్రులు ఆగ్రహించారన్నారు. ఈ ఘటనలో విద్యార్థిపై దాడి చేసినట్లు ఆరోపిస్తున్న విద్యార్థికి కౌన్సెలింగ్ నిర్వహించామని, పద్ధతి మార్చుకోకపోతే రానున్న అకాడమిక్ సంవత్సరంలో వేరే పాఠశాలకు బదిలీ చేస్తామని తెలిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, అలాగే సెలవు దినాల్లో ఒకరికి అదనంగా మరొక ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందివ్వడంతో పాటు వైద్యులకు సంప్రదించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు.

మెడికల్ కళాశాల నిర్మాణాలను అడ్డుకున్న రైతులు

- నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్
- రైతులపై దాడి చేసిన కాంట్రాక్టర్
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- ఫిర్యాదు చేసిన రైతులు



కళాశాల భవన నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: నష్ట పరిహారం ఇవ్వకుండానే నమ్మించి మోసం చేసి మెడికల్ కళాశాలను నిర్మించారని నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే అదనపు భవనాల నిర్మాణాలను చేపట్టాలంటూ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ మెడికల్ కళాశాల వద్ద పనులను మూడు రోజుల నుంచి రైతులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కాంట్రాక్టర్ దగ్గరుండి పనులు చేయిస్తుండగా విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి పనులు నిలిపివేయాలని కోరారు. దీంతో కాంట్రాక్టర్ ఆవేశానికి లోనై రైతులపై దాడి చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తమపై దాడిచేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దూరు శివారులోని సర్వే నంబర్ 408లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో అప్పటి ప్రభుత్వం 40 మంది నిరుపేద రైతులకు జీవనోపాధి కోసం అందించాయి.

జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు కావడంతో అప్పటి మంత్రి కేటీఆర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి రైతులకు సమాచారం ఇవ్వకుండానే 36 ఎకరాల స్థలాన్ని కళాశాలకు కేటాయించారు. దీంతో తమ భూములను తీసుకోవద్దంటూ రైతులు ఆందోళన చేయడంతో రైతులతో కేటీఆర్ మాట్లాడి నష్టపరిహారంతో పాటు వాణిజ్య, వ్యాపారానికి సంబంధించిన భూములలో మనిషికి 800 గజాల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి కళాశాలను అమమేఘాల మీద నిర్మించారు. కేటీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు అదనపు భవనాలను నిర్మించకుండా అడ్డుకుంటామని తీర్మానం చేసుకొని మూడు నెలల నుంచి పనులను అడ్డుకుంటూ వస్తున్నారు. ఫిబ్రవరి 7వ తేదిన కాంట్రాక్టర్ పనులను ప్రారంభించేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి రాగా రైతులు అడ్డుకున్నారు.

దీంతో కలెక్టర్ స్పందించి రైతుల సమస్యను పరిష్కరించాలని అప్పటి ఆర్డీవోను ఆదేశించగా ఆర్డీవో ఆ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నష్టపరిహారంతో పాటు స్థలాలు ఇస్తామంటూ సర్వేయర్‌తో సర్వే చేయించి వదిలేశారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అప్పటి ఆర్డీవో బదిలీపై వెళ్లిపోవడంతో కొత్తగా వచ్చిన ఆర్డీవో వీరి సమస్యలను పట్టించుకోకపోవడంతో పాటు సోమవారం కాంట్రాక్టర్ తిరిగి పనులను ప్రారంభించగా రైతులు పనుల ను అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ పోలీసులకు సమాచారం అందించడంతో రైతులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల సమస్యలు విన్న సీఐ రెవెన్యూ అధికారులతో మాట్లాడి నష్టపరిహారం రాలేదని విషయం తెలుసుకొని రైతులను పంపించి వేశారు. దీనిలో భాగంగానే బుధవారం తిరిగి పనులను చేస్తుండగా రైతులు అడ్డుకొని పనులను నిలిపివేయించడంతో పాటు రిలే నిరహారదీక్షలు కూడా చేస్తామంటూ ఆందోళన చేపట్టారు. సాయంత్రం కాంట్రాక్టర్ మెడికల్ కళాశాల పనుల వద్దకు చేరుకొని ఆందోళన చేస్తున్నా రైతులపై దాడి చేయడంతో రైతులు ప్రతిఘటించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

నష్ట పరిహారం కోసం న్యాయబద్ధంగా పోరాటం చేస్తున్న తమపై దాడిచేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్, అశోక్, రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, లింగంపల్లి దేవరాజం, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఏప్రిల్ 10: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో బుధవారం స్వామివారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రదీప్ కుమార్, నేరెళ్ల సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై స్వామివారల విహారం



నెమలి వాహనంపై విహరిస్తున్న స్వామివారు

వేములవాడ, ఏప్రిల్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో పార్వతీ రాజ రాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివారలు నెమలి వాహనం పై విహరించారు. రాజ రాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం పార్వతి రాజరాజేశ్వరస్వామి, సీతా రామచంద్రస్వామి వారలకు పూజలు నిర్వహించారు. రాత్రి పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను నెమలి వాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: రేషన్ బియ్యం అక్రమంగా రైస్‌మిల్‌కు తరలించిన కేసులో నిందితులైన గోపాల్‌పూర్ రేషన్ డీలర్ బెజ్జంకి అంజయ్య, రైస్‌మిల్ యజమాని మొగసాల సంతోష్‌రెడ్డి, ఆటో యజమాని, డ్రైవర్ ఊరడి మధులను బుధవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించామని తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ రేషన్ డీలర్ అంజయ్య పేదలకు పంపిణీ కోసం వచ్చిన పీడీఎస్ బియ్యాన్ని దుర్శేడ్‌లోని శ్రీ వెంకటేశ్వర మినీ రైస్‌మిల్‌కు తరలించి విక్రయించే యత్నంలో సోమవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌బ్రాంచి, రూరల్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. దీనిపై మంగళవారం కేసు నమోదు కాగా నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: ఎల్లారెడ్డిపేట శివారులోని సంచార జీవుల గుడిసెలో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనపర్చుకున్నామని పోలీసులు తెలిపారు. ఖచ్చితమైన సమాచారంతో గుడిసెలో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. గుడిసెలో నివసిస్తున్న వ్యక్తులు పారిపోయారని చెప్పారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 13 మంది వాహనదారులను బుధవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఇద్దరు వాహనదారులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 4,500 రూపాయలు జరిమానా విధించారని తెలిపారు. మిగతా 11 మంది వాహనదారులకు 21 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

సికింద్రాబాద్‌లో యువకుడి ఆత్మహత్య



సాయితేజ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: మండలం దుమాల గ్రామానికి చెందిన సాయితేజ (19) అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సికింద్రాబాద్‌లో అద్దెకు ఉంటున్న భవనంపై మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామంలోని పాముల వనిత-సంతోష్ గౌడ్‌కు ముగ్గురు కొడుకులు బన్నీ, సాయితేజ, అరవింద్ ఉన్నారు. సంతోష్ గౌడ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో సంతోష్‌గౌడ్ పదేళ్ల కిందట ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వనిత తన ముగ్గురు పిల్లలతో కలిసి ఉపాధి నిమిత్తం యేడాది కిందట సికింద్రాబాద్‌కు వెళ్లింది. అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకుని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సాయితేజ మానసికంగా ఆరోగ్య పరిస్థితి బాగలేక పోవడం వల్ల అద్దెకు ఉంటున్న భవనంపై మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచా రం అందుకున్న అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

తల్లితో కలిసి ఉండడం నచ్చకే పినతండ్రి హత్య

డీఎస్పీ ఉమామహేశ్వరరావు



హంతకుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

మల్లాపూర్, ఏప్రిల్, 10: తల్లితో కలిసి పినతండ్రి అంబదాస్ ఉండటం నచ్చక కోపంతో తనయుడు కందెం రవితేజ హత్య చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం హంతకుడు రవితేజను మల్లాపూర్ నంది విగ్రహం నుంచి వెళ్తుండగా అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు వివరాలు తెలిపారు. మల్లాపూర్ దుర్గమ్మకాలనీకి చెందిన అంబదాస్ (54) తన రెండో భార్య అయిన భోజమ్మతో పాటు ఆమె కుమారుడు కందెం రవితేజతో కలిసి పదిహేనేళ్ల నుంచి నివాసం ఉంటున్నారన్నారు. రవితేజ చిన్నతనంలోనే తండ్రి రమేష్ మరణించగా భోజమ్మ కుమారుడు రవితేజతో కలిసి అంబాదాస్‌తో మల్లాపూర్‌లోని దుర్గమ్మ కాలనీలో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. తన తల్లి భోజమ్మ సంపాదించిన డబ్బులను అంబదాస్ వాడుకుంటున్నాడని రవితేజ కోపం పెంచుకున్నాడన్నారు. రవితేజ పని చేయకుండా జల్సాగా తిరుగుతుండగా పినతండ్రి అయిన అంబదాస్ మందలించేవాడని ఇలా చాలా రోజు నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవన్నారు. అప్పటి నుంచి జల్సాలకు అడ్డుగా ఉన్నాడని భావించి అంబాదాస్‌ను చంపాలని రవితేజ కోపం పెంచుకున్నాడన్నారు. దీంతో రవితేజ స్నేహితుడి ఇంటికి వెళ్లి మామిడి కాయలు కొట్టడానికి కత్తి అవసరం ఉందని తెచ్చుకొని శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడుకొని ఉన్న అంబుదాస్‌పై కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి పారిపోగా అంబుదాస్ అక్కడిక్కడే మృతి చెందాడన్నారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమారలు పరిశీలించి కేసు నమోదు చేసుకొని రవితేజను రిమాండ్ తరలిస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మణిదీప్ (ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 10: ప్రేమించిన యువతితో ఏర్పడిన మనస్పర్థలతో విడిపోయిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రామన్నపేటకు చెందిన వకుళాభరణం మణిదీప్ (31) ఎంబీఏ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మరింది. వారి ప్రేమలో మనస్పర్థలు రావడంతో మనస్థాపం చెందిన మణిదీప్ గత ఫిబ్రవరిలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. మళ్లీ మంగళవారం రాత్రి ఇంట్లోని వంట గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకోవడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



నజీర్ (ఫైల్)

ముస్తాబాద్, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్లలో నివాసముంటున్న ఎండీ నజీర్ (42) ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన ఎండీ నజీర్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ అనా రోగ్య కారణంతో ఉండలేక తిరిగి వచ్చాడు. తాగుడుకు బానిసైన నజీర్ ఆర్థికస్థితి బాగాలేక మనస్తాపంతో గత నెల 24వ తేదీన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేట జిల్లా కేంద్రానికి చికిత్స నిమిత్తం పంపించారు. చికిత్స పొందుతూ నజీర్ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి బిజాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రబోయిన రాజు(49) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం తన పొలం గట్టుపై ఉన్న గడ్డికోస్తుండగా సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ ఉంది. చూసుకోకుండా అటువైపు వెళ్లి గడ్డి కోసిన రాజు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన లింగారెడ్డి

కోరుట్ల రూరల్, మార్చి 10: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి లింగా రెడ్డి (70) అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లింగా రెడ్డి కొన్ని రోజులుగా షుగర్‌తో బాధ పడుతూ చికిత్స చేయించుకున్నాడు. చికిత్సలో లింగారెడ్డి కాలు వేలును వైద్యులు తొలగించారు. అప్పడి నుంచి నిత్యం లింగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. బుధవారం గ్రామ శివారులోని ఓ రేకుల షేడ్‌లో ఉదయం ఉరివేసుకుని అత్మహత్య చేసుకున్న ట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించి నట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరుకుని పరిశీలన జరిపారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల, ఏప్రిల్ 10: మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు నుంచి దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ వైపు వెళ్తున్న కారు బుధవారం అదుపు తప్పి సమీపంలోని పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్లకు చెందిన వేణు అతని కుమారునికి గాయాలైనట్లు తెలిసింది. గాయాలపాలైన వారిని పోలీసులు చికిత్స నిమ్మిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులకు రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

చెరువులో పడి వన్యప్రాణి మృతి



నీటిలో మృతి చెందిన మనుబోతు

వీర్నపల్లి, ఏప్రిల్ 10: చెరువులో పడి వన్యప్రాణి మృతిచెందిన సంఘటన మండలంలోని రంగంపేటలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామశివారులోని ఆటవీ ప్రాంతం నుంచి మార్గండి చెరువులో నీరు తాగడానికి వచ్చిన మనుబోతు అందులో పడి మృతి చెందింది. సమాచారం అందుకున్న ఆటవీ శాఖ సెక్షన్ అధికారి పద్మలత సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చనిపోయిన మనుబోతు కళేబరాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. పశుసంవర్ధక సిబ్బందితో పంచనామా నిర్వహించి కళేబరాన్ని దహనం చేశారు.

కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

మల్యాల, ఏప్రిల్ 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి జరిగే చిన్నహను మాన్ జయంతి ఏర్పాట్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. కొండపైన ఆలయ పరిసరాలు, కోనేరు, మాల విరమణ, క్యూలైన్‌లు ఎస్పీ పరిశీలించారు. వందలాది పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇప్పటి నుంచే ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చందర్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై అబ్దుల్ రహీం, ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఏఈ లక్ష్మణ్‌రావు ఉన్నారు.

రాజన్న హుండీ ఆదాయం కోటి 27 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ, ఏప్రిల్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా కోటి 27 లక్షల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది. 15 రోజుల వ్యవధిలో భక్తులు స్వామి వారి హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో గట్టి భద్రత మధ్య బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా కోటి 27 లక్షల 78 వేల 950 రూపాయల నగదు, 90 గ్రాముల బంగారం, తొమ్మిది కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ఉద్యోగులు, శివరామ కృష్ణ భజనమండలి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

బల్దియా కార్మికుల సమ్మె విరమణ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 10: నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించారు. పెండింగ్ అరియర్స్‌తోపాటు ఇతర తమ న్యాయమైన డిమాండ్లను ఈనెల 10లోగా పరిష్కరించకుంటే 11 నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేస్తామని కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం అనుబంధ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఎల్ రూప్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను మేయర్ సునీల్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బుధవారం వారిని చర్చలకు ఆహ్వానించి కార్మికుల సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్లపై మేయర్ క్యాంపు కార్యాలయంలో సునీల్‌రావు చర్చించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రెండు విడుతల అరియర్స్‌ను ఇచ్చామని, మరో విడత అరియర్స్‌తోపాటు మిగిలిన న్యాయమైన డిమాండ్లు, సమస్యలన్నిటిని పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా విధులను బహిష్కరించి సమ్మెకు వెళ్లడం సరికాదంటూ చెప్పారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఎండలు తగ్గుముఖం పట్టే వరకు గతంలో మాదిరిగా పారిశుధ్య కార్మికులు, జవాన్లు, ఇన్‌స్పెక్టర్లు మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే విధులు నిర్వహించాలని సూచించారు. మేయర్ ఇచ్చిన హామీలను కార్మికులకు వివరించి సమ్మెను విరమిస్తున్నట్లు కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రకటించారు.

● సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- మేయర్ సునీల్‌రావు

ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పాలకవర్గ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. గతంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఏప్రిల్ నెలాఖరులోగా పెండింగ్ అరియర్స్ చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారులను అభినందించిన ఏసీపీ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10: కరాటేలో ప్రతిభ చూపిన క్రీడాకారులను బుధవారం టౌన్ ఏసీపీ నరేందర్ తన కార్యాలయంలో అభినందించారు. ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో స్థానిక మంకమ్మతోటలోని సిద్దార్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కరాటే పోటీ పరీక్షల్లో కరాటే శిక్షకుడు పుల్లూరి శ్రీనివాస్ శిక్షణలో ఐదుగురు క్రీడాకారులు బ్లాక్ బెల్ట్ సాధించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో క్రమ శిక్షణ, ఆత్మస్థైర్యం అలవడుతుందన్నారు. క్రీడాకారులు వి వైష్ణవి, ఎల్ సుప్రీతి చౌహాన్, ఎల్ ప్రీతమ్‌చౌహాన్, కె తేజస్‌రెడ్డి, ఆర్ శ్రీవర్ధన్‌లు బ్లాక్‌బెల్ట్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఒకినోవా కరాటే సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

మరియమ్మ పొంగల్ ఉత్సవాల్లో ఎంపీ బండి సంజయ్



ఉత్సవాల్లో పాల్గొన్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 10: కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీమరియమ్మ పొంగల్ ఉత్సవాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొత్తపల్లి, రూరల్ మండలాల్లో ఇటీవల మరణించిన కుటుంబాలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్ల మెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ బుధవారం పరామ ర్శించారు. కొత్తపల్లి మండలంలోని బావుపేటకు చెందిన బీజేవైఎం కార్యకర్త శీలం అనిల్‌యాదవ్, బీజేపీ కార్యకర్త నాగరాజు తండ్రి బాలయ్య, కొండాపూర్ గ్రామానికి చెందిన చిరంజీవి తండ్రి మొంగోని మల్లయ్య మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చలివేంద్రం ప్రారంభం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 10: తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో కమాన్ వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి సమర్థవంతంగా అమలు చేయడమే కాకుండా ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులు ప్రజల కోసం చలి వేంద్రాన్ని ఏర్పాట చేయడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మినిస్టీరియల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరికృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో కోశాధికారి కిరణ్‌కుమార్, టౌన్ ప్రెసిడెంట్ సర్దార్ హర్మిందర్‌సింగ్, క్లాస్ ఫోర్ సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, తంసా అధ్యక్షుడు హరికృష్ణ, కోశాధికారి షేక్ అంజద్, కిరణ్, కళ్యాణ్, శేఖర్, రమణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్ సతీమణి మాధవి

గంగాధర, ఏప్రిల్ 10: ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి ఉపాధి హామీ కూలీలను కోరారు. గంగాధర మండలం గట్టుబూత్కూర్‌లో వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆమె బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. గతంలో ఎంపీగా వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. కూలీలకు ఎలాంటి ఆరోగ్యసమస్యలు ఉన్న ప్రతిమ ఫౌండేషన్ ద్వారా తాను చికిత్స చేయిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, బోయినపల్లి వినోద్‌కుమార్‌కు అవకాశమివ్వాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌రావు, మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి, బోయినపల్లి మాజీ ఎంపీపీ భాగ్యలత, గీతారెడ్డి, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ప్రారంభం

ఇల్లందకుంట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో ఆర్యవైశ్య అన్నసత్రాన్ని సంఘ సభ్యుల ఆధ్వర్యంలో తహసీల్దార్ రాణి, ఆలయ ఈవో సుధాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులు మాట్లాడుతూ ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయానికి ఆర్యవైశ్య భక్తులు పెద్ద ఎత్తున వస్తున్నారన్నారు. వారి సౌకర్యం కోసం నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాణి, ఆలయ ఈవో సుధాకర్‌ను ఆర్యవైశ్య సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రమేష్, నాగరాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్యం, శివశంకర్, రాజు, సతీష్, వేణు, ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రవీందర్, వెంకన్న, శివకుమార్, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న గ్రామస్థులు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 10: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో నల్ల పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిపారు. వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

-బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి

మానకొండూర్, ఏప్రిల్ 10 : రాష్ట్రంలో హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడబోయిన రామకృష్ణారెడ్డి ఆరోపించారు. రైతులు, చేనేత కార్మికులతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పయనిస్తోందన్నారు. పదేళ్ళుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తూ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు రెండు లక్షల రుణమాఫీ, క్వింటాలుకు రూ.500 బోనస్, చేనేత కార్మికులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. సిరిసిల్లలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన చేనేత దీక్ష చేయడంతో రాష్ట్రప్రభుత్వం దిగి వచ్చి బకాయిలు చెల్లించేందుకు సిద్ధమైందన్నారు. రైతులు, చేనేత కార్మికులతో అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి బీజేపీ ఉద్యమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్, నందగిరి బలరాం, రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన గోపాల్

రామడుగు, ఏప్రిల్ 10 : రామడుగు ఎంపీపీగా పూరెల్ల గోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల 30 ఎంపీపీ కవితపై అవిశ్వాస తీర్మానం నెగ్గిన నేపథ్యంలో ఆమె పదవి కోల్పోయింది. ప్రస్తుతం వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న గోపాల్‌కు ఇంచార్జి ఎంపీపీగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ నెల 15న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ మెంబర్ల ఎన్నికకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాగా అధికార పార్టీకి చెందిన జవ్వాజి హరీష్ ఎంపీపీ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 10: బడుగు, బలహీనవర్గాల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని యునైటెడ్ పూలే ఫోరం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. చదువు ద్వారానే బడుగుల జీవితాల్లో మార్పు సాధ్యమని భావించి పేదబడుగు వర్గాలకు చదువు నేర్పించిన మహనీయుడు ఆయన అని కొనియాడారు. కేవలం చదువుతోనే సమాజంలో స్వేచ్ఛ, సమానత్వంతో పాటు ప్రశ్నించే హక్కు సాధ్యమవుతుందని బలంగా నమ్మిన మహనీయుడు పూలే అని, అలాంటి మహనీయుడి విగ్రహాన్ని తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో తెలంగాణ యునైటెడ్ ఫోరం గత కొన్నిరోజులుగా డిమాండ్ చేస్తుందని అన్నారు. ప్రభుత్వ మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేస్తారా చేయరా అనే విషయం గురువారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగానైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హరిప్రసాద్ ఫోరం పక్షాన హెచ్చరించారు.

వాసవి వనిత వాగ్దేవి క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 10: వాసవీ వనిత వాగ్దేవి క్లబ్ ఆవిర్భావం, కార్యకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం వాగేశ్వరి కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు చందా విజయలక్ష్మి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆవునూరి శివలీల హాజరయ్యారు. అనంతరం క్లబ్‌ను ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షురాలిగా మాడిశెట్టి ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి స్వరూప, కోశాధికారిగా రాగి అనిత చేత జిల్లా గవర్నర్ జంధ్యం మాదవి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ జంధ్యం మధుకూర్, కోశాధికారి కేశెట్టి వంశీకృష్ణ, వైస్ గవర్నర్ పబ్బ అరుణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చందా రవీందర్, క్లబ్ కోశాధికారి పండకంటి అనురాధ, కార్యదర్శి నూనె పద్మావతి తదితరులు పాల్గొని నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు.

సుడా చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 10: కరీంనగర్ విద్యానగర్‌లోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేన్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి మాట్లాడుతూ సుడా చైర్మన్‌గా వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యవర్గం నరేందర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి కొండ రవీందర్, సత్తయ్య, కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, మహాలక్ష్మి, తిరుమల, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, భరత్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో తాగునీటి పరిష్కారానికి హెల్ప్‌డెస్క్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 10: కొత్తపల్లి మున్సిపల్ పరిధిలో మంచినీటి సమస్యల పరిష్కారానికి హెల్ప డెస్క్ ఏర్పాటు చేసినట్లు కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో మంచినీటి సమస్య కోసం 9676420727, 9989593973 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో మున్సిపల్ పర్మిషన్ లేకుండా అక్రమ లేఅవుట్స్, ఇంటి నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. టిఎస్‌బిపాస్ ఆన్‌లైన్‌లో నిర్మాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలో పరిశీలన చేసి మున్సిపల్ కార్యాలయం నుండి అనుమతి పొందాలన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా శ్రీరామ పాదుకారాధన



శ్రీరామ పాదుకలకు పూజలు చేస్తున్న పురోహితులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 10: జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో క్రోధి నామ నూతన సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం ఉదయం శ్రీరామ పాదుకారాధనను ఘనంగా నిర్వహించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి ఉదయం, సాయంత్రం రామాయణంపై, రాముని వ్యక్తి త్వం, జీవితం, గుణగణాలు, ప్రజా హిత, సుభిక్ష ఆదర్శ పాలన వంటి అంశాలపై ప్రవచనం చేశారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహ రావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమ రావు, బీవి రావు, యాద కిషన్, ఎల్ భూపతి రావు, ఎస్ వేంకటేశం, వరప్రసాదాచార్యులుతో పాటు పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 10: రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మాచర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ మంత్రి కార్యాలయంలో నగరానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ జక్కని ఉమాపతి, పాల్తేపు కిషన్, పోకల లక్ష్మీనారాయణ తదితరుల మెడలో పార్టీ కండువా కపి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులమై కాంగ్రెస్ ద్వారా మాత్రమే ప్రజలు మెచ్చిన సుపరి పాలన సాధ్యమవుతుందనే సంపూర్ణ విశ్వాసంతో కాంగ్రెస్‌లో చేరామన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఎన్నికలకు రాజకీయ నాయకులు సహకరించాలి



వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో రమేష్

హుజూరాబాద్, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరిగేందుకు ఓటర్లకు రాజకీయ నాయకులు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలప్పుడు ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు.

అనంతరం డివిజన్‌లోని తహసీల్దార్లతో ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సొల్లు బాబు, ప్రభాకర్, కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

జమ్మికుంట, ఏప్రిల్ 10: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నిత్య యోగా సాధన సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యోగ సాధకులు మాట్లాడుతూ చుట్టూ పక్కల గ్రామాల నుంచి జమ్మికుంటకు వచ్చే ప్రజల దాహార్తి కోసం తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. చల్లని మినరల్ వాటర్ ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బచ్చు వీరలింగం, ఒల్లాల బాపుశెట్టి, గుడిపాటి వీరారెడ్డి, చిటికేశి శివానందయ్య, చిదురాల శ్రీనివాస్, గర్రెపల్లి వెంకటేశ్వర్లు, ముంజాల స్వామి, ఎ రమేష్, రావికంటి రవీందర్, ఎమ్ జగదీశ్వర్, వి రమేష్, ఉపేందర్, రాజగోపాల్, భూపతి భాస్కర్, ఆర్ నీలకంఠం, బ్రహ్మజి పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలోని వర్తక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవికాలం దృష్ట్యా ప్రయాణికుల దాహం తీర్చడానికి చలింద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వర్తక సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వర్తక, వ్యాపార సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చొప్పదండి, ఏప్రిల్ 10: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హన్మకొండ ఎస్‌బీ డీఎస్పీ మావురం జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రేవెల్లిలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తానుకూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఎస్సైగా ఉద్యోగం సాధించి డీఎస్పీ స్థాయికి ఎదిగానన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో క్రమశిక్షణ పాటిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. ఆపదలోఉన్న పిల్లల రక్షణ, సాయం కోసం 1098, సైబర్ క్రైమ్ మోసాలు జరిగినపుడు 1930, ఎమర్జెన్సీ పోలీస్ సర్వీస్ కోసం డయల్ 100 వంటి ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయని, అత్యవసర పరిస్థితుల్లో వాటిని వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్, సిగరెట్, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరిపురం ఆనందం, విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఇరుగురాల అంజయ్య, యాటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, అరుణశ్రీ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

ఇల్లందకుంట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు అన్నారు. బుధవారం ఆలయ మండపం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆలయ ఈవో కందుల సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. కల్యాణం రోజు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు దగ్గర ఉండి చూసుకోవాలని తహసీల్దార్ రాణికి సూచించారు. గతంలో కంటే ఏర్పాట్లు బాగా చేయాలన్నారు. తాగునీటి స్టాల్ ఎక్కువగా పెట్టాలన్నారు. వాహనాల పార్కింగ్ కల్యాణ మండపంకు దూరంగా ఉండే విధంగా స్థల పరిశీలన చేయాలన్నారు.

నిధుల దుర్వినియోగంపై త్వరగా విచారణ చేపట్టాలి



విచారణ జరిపించి సర్వీసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ఉపాధ్యాయులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 10: మండలంలోని ఎల్ఎండీ కాలనీ ఉన్నత పాఠశాలలోని స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల 10 లక్షల రూపాయల జీతాల బిల్లుల దుర్వినియోగంపై ఉన్నతధికారులు విచారణకు ఆదేశించారు. బుధవారం ప్రారంభం కావల్సిన విచారణ అనివార్య కారణల వల్ల వాయిదా పడింది. దీంతో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఎల్ఎండీ జిల్లా పరిషత్ పాఠశాలకు చేరుకుని తమ సర్వీస్ పుస్తకాలు తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఎదుట కాసేపు ఎదురు చూశారు. ప్రధానోపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంతో ఉపాధ్యాయులు చాలా సేపు ఎదురుచూసి ఆగ్రహంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బిల్లులు దుర్వినియోగం పై గత శుక్రవారం డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు విచారణ జరగాల్సి ఉండగా అకస్మాత్తుగా నిలిపివేశారన్నారు. డీఈవో ఆదేశాలు జారీ చేసి ఆరు రోజులైనా ఇప్పటి వరకు ప్రాథమిక విచారణ జరగలేదని, కనీసం రికార్డులను స్వాధీనం చేసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవోకు ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ చేపట్టి భద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎం తిరుపతి రెడ్డి, డి శ్రీధర్, బి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధించిన ఇద్దరిపై కేసు

వీణవంక, ఏప్రిల్10: మండలంలోని కనపర్తి గ్రామంలో ఓ మహిళను ఎనిమిది నెలలుగా అదే గ్రామనికి చెందిన కర్నే హరీష్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. తనను ప్రేమించాలని ఇంటి చుట్టూ తిరుగుతూ సైగలు చేస్తూ తను చెప్పినట్లు వినాలని మనో వేదనకు గురి చేస్తున్నాడని, అతనికి కర్నే వినయ్ సహకరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు

వీణవంక, ఏప్రిల్10: వీణవంక మండలం కనపర్తి గ్రామంలో కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన కర్నే హరీష్, బూర్గుల అజయ్‌లను మంగళవారం పాత పగలు మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన పంజాల ఐలయ్య, పంజాల శ్రీకాంత్, బాలసాని సదయ్యలు కులం పేరుతో దూషించి ప్లాస్టిక్ పైపులతో కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొనగా వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల కవాతు

వీణవంక, ఏప్రిల్10: మండలంలోని ఎల్బాక గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించు కోవాలని అన్నారు. గ్రామస్థులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి తదితరులున్నారు.

కవి సమ్మేళనం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 10: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో క్రోధి నామ సంవత్సరం సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, తెలుగు విభాగాధిపతి సిహెచ్ కవిత, లైబ్రేరియన్ కె మోహన్‌రావు, మౌనిక, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం అక్రమ దందాను అరికట్టాలి

భగత్‌నగర్, ఏప్రిల్10: రేషన్‌బియ్యం అక్రమ దందాను అరికట్టాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఒక ప్రకటనలో అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎల్ఎల్ఎం పరీక్ష ఫీజు 22లోగా చెల్లించాలి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 10: ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 22వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 25 వరకు తుది గడువు అని ఆయన తెలిపారు. ఈ పరీక్షలను మే నెలలో నిర్వహించనున్నారు.

●గణేశ్‌నగర్, ఏప్రిల్10: ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్‌బి మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించడానికి 22 వరకు,300/- అపరాధ రుసుంతో 25 వరకు తుది గడువు అని పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను మే నెలలో నిర్వహించనున్నారు.

భూమి హద్దులు చూపాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 10: కొత్తపల్లిలో సర్వే నంబరు 127లో వడ్ల కల్లాల ధాన్యం కొనుగోలు భూమి హద్దులను చూపాలని కొత్తపల్లికి చెందిన మన ఆదర్శ రైతు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ బండ కృష్ణరెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబరు 528, 529, 530 వడ్ల కల్లాల కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన 5 ఎకరాలు, మొత్తం 10 ఎకరాల భూమికి సంబంధించిన హద్దులను చూపాలని కోరారు. మరో పది రోజుల్లో వరి కోతలు మొదలవుతాయని స్థలం హద్దులను చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

హుజూరాబాద్, ఏప్రిల్ 10: హుజూరాబాద్ నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు తమ ఉపవాస దీక్షలు విరమించి ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

గంగాధర, ఏప్రిల్ 10: ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్‌గౌడ్ విమర్శించారు. బుధవారం ఆయన గంగాధరలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కొండగట్టు దర్శనం అనంతరం అంజన్న సాక్షిగా అబద్దాలు మాట్లాడారన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అశోక్, మిట్ట మధు, పెంచాల రాములు, రాజేంద్రప్రసాద్, రాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

తిమ్మాపూర్, ఏప్రిల్ 10: మండలంలోని పోలంపల్లి, నర్సింగ పూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవా రం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా పర్యటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, ఎంపీటీసీ బండారి రమేష్ పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా సమావేశం

చొప్పదండి, ఏప్రిల్ 10: పట్టణంలో బీజేపీ పార్లమెంట్ ఎస్సీ మోర్చా ఎన్నికల కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండ ల అధ్యక్షులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమవేశంలో సుధాకర్, తాళ్ల రాజశేఖర్, ముద్దం చందు, రాములు, గంట హరీష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

రామడుగు, ఏప్రిల్ 10: మండలంలోని దత్తోజీపేట రెడ్డి సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంట్ల బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శి గంట్ల శరత్‌చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా సాదు రాజిరెడ్డి, పింగిలి మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా గోపు రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సలహాదారుడిగా గంట్ల వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మానకొండూర్, ఏప్రిల్ 10: మండలంలోని ఊటూర్, దేవం పల్లి సహకార సంఘాల పరధిలోని మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు కోరారు.

సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ మృతి

మానకొండూర్, ఏప్రిల్ 10: మండలంలోని గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండపల్లి సత్తయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అంతక్రియల్లో పాల్గొన్నారు.